## క్లుప్తంగా

### క్రీడలతోనే మానసికోల్లాసం



విజేత జట్టుకు నగదు బహుమతి ప్రదానం

**వెదురుకుప్పం:** క్రీడలతోనే మానసికోల్లాసం సాధ్యమని వైఎస్ఆర్ సీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మరకాలకుప్పం రామయ్య, వైద్య విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు కోలార్ ప్రకాష్ అన్నారు. వెదురుకుప్పంలో 15 రోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నీ మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా టోర్నీ విజేతలకు నగదు బహుమతులు ప్రదానం చేశారు. సత్య లెవన్స్ జట్టుకు మొదటి బహుమతిగా రూ.10,116, ద్వితీయ బహుమతిగా భారత్ లెవెన్స్ జట్టుకు రూ.6 వేలు నగదు బహుమతి ప్రదానం చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. గ్రామీణప్రాంతాల్లో ఇలాంటి క్రీడలు నిర్వహించడం ద్వారా స్నేహ సంబంధాలు బలపడుతాయన్నారు.

### మామిడి గుజ్జు పరిశ్రమలో జిల్లా ఎస్పీ తనిఖీలు



గుజ్జు పరిశ్రమలో జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు

**గంగాధరనెల్లూరు:** మండలంలోని జైన్ ఫామ్ ఫ్రెష్ మామిడి గుజ్జు కర్మాగారాన్ని మంగళవారం చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు సందర్శించారు. కర్మాగారంలోని పలు విభాగాలను తనిఖీ చేశారు. అక్కడ భద్రత ఏర్పాట్లు, కర్మాగారంలో నిల్వ చేసే సామర్థ్యాన్ని సమీక్షించారు. ఫ్యాక్టరీ యాజమాన్యంతో సమావేశమై ప్రాసెసింగ్ నిల్వ ప్రక్రియ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనివాసంతి, జైన్ కర్మాగారం మేనేజర్ దిలీప్ శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

### ఘనంగా తిరునాళ్లు



అలంకరణలో అమ్మవారు

**వెదురుకుప్పం:** మండలంలోని పచ్చికాపల్లం పంచాయతీ బొమ్మన్‌దొడ్ల గ్రామంలో ఉన్న ఆరిమాని గంగమ్మ ఆలయంలో మంగళవారం తిరునాళ్లను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయమే గంగమ్మ ఆలయం వద్ద అమ్మవారికి అంబలి పోసి, ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు. పేట గ్రామం వద్ద ఉన్న ముత్యాలమ్మకు మహిళలు పెద్ద ఎత్తున పొంగళ్లు ప్రసాదాలను నివేదించారు. మాంబేడు, దిగువగెరిగదొన, కసవనూరు, గొల్లపల్లె గ్రామాలలో ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయంలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ప్రతిమను ప్రత్యేకంగా అలంకరించి ఊరేగింపు చేశారు. మహిళలు అమ్మవారికి కర్పూర నీరాజనాలు, మంగళహారతులు సమర్పించి కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి సందడి చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన విద్యుత్‌దీపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

# చిరుధాన్యాలపై రైతన్న చూపు



నగరి పేటలో సాగులో ఉన్న సజ్జ పంట



నగరి మండలం కృష్ణారామపురంలో సజ్జ పంట

- పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- ప్రజలకు ఆరోగ్యంపై పెరుగుతున్న శ్రద్ధ
- మార్కెట్‌లో చిరుధాన్యాలకు గిరాకీ

**నగరి:** ఆరోగ్యానికి తృణధాన్యాలు ఎంతో మేలు చేస్తాయని వైద్యులు సూచిస్తున్నారు. దీంతో రోజురోజుకు తృణధాన్యాల వినియోగం పెరుగుతూ వస్తోంది. సేంద్రియ పద్ధతుల ద్వారా పండించే చిరుధాన్యాలకు మార్కెట్లో మంచి గిరాకీ ఉంది. గతంలో నియోజకవర్గంలోని మండలాల్లో చిరుధాన్యాల సాగు ఎక్కువగా ఉండేది. రాను రాను వాణిజ్య పంటల సాగు ఎక్కువైంది. అయితే గడచిన కొద్ది సంవత్సరాలుగా ఆరోగ్య సంబంధిత అంశాల దృష్ట్యా పలువురు చిరుధాన్యాల వాడకంపై దృష్టి సారించడం, దీంతో చిరుధాన్యాల వినియోగం మరలా పెరగడం, మార్కెట్ గిరాకీతో ఎక్కువ విస్తీర్ణంలో రాగులు, జొన్నలు, సజ్జలు తదితర పంటలు పండిస్తున్నారు. ప్రస్తుతం సజ్జ అనుకూలమైన సమయం కావడంతో నియోజకవర్గంలో 170 ఎకరాల్లో సజ్జ పంట సాగవుతోంది.

### వాతావరణం అనుకూలం

వాతావరణ పరిస్థితుల్లోని అసమానతలను తట్టుకొనే చిరుధాన్యాల (తృణధాన్యాలు) సాగు ఎంతో మేలని నిపుణులు సూచిస్తున్నారు. వర్షాలు లేకపోయినా తృణధాన్యాలు ఎంతో సులువుగా పండుతాయి. ప్రస్తుతం తేలికపాటి వర్షాలు ఉన్న వాతావరణంలోనే సజ్జల సాగు నియోజకవర్గంలో ఊపందుకుంది. తొలకరి రాగానే తిండి గింజల కోసం విరివిగా సాగయ్యే పంట వరి పంట. వరి పూర్తి పంటకాలం దాదాపు 120 రోజులు. అన్ని రోజులపాటు ఆహార దినుసుల కోసం ఎదురు చూడనవసరం లేకుండా 90 రోజుల కంటే ముందే చేతికి వచ్చే తృణధాన్యాలను రైతులు పండిస్తున్నారు. ఈ పంటలతో ఆహార కొరత తీరడమే కాకుండా మంచి మార్కెట్ ఉండడంతో గిట్టుబాటు ధరలతో గిరిజన రైతులు లాభాలు పొందుతున్నారు. ఒకప్పుడు ఒడిశా, చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లో రాగులు, సజ్జలు, జొన్నలు ప్రధాన ఆహారంగా ఉండేవి. రాను రాను ఆ స్థానాన్ని గోధుమ, మైదా, వరి ఆక్రమించుకొంది. అయితే ప్రస్తుతం మార్కెట్ బాగుండడంతో రాష్ట్రంలో చిరుధాన్యాల సాగు పెరుగుతూ వస్తోంది. వరి, గోధుమ వంటి ప్రధాన పంటల పరిశోధనలు పెరుగుతున్నా తృణధాన్యాలపై తగ్గుతున్నాయని పలువురు చెబుతున్నారు. ప్రభుత్వం చిరుధాన్యాల సాగులో ఎక్కువ ఆసక్తి చూపితే మరింత ఎక్కువ విస్తీర్ణంలో రైతులు పండించే అవకాశముంటుందని పలువురు చెబుతున్నారు.



నింద్ర మండలం అగరం పేటలో సజ్జ పంట

#### రైతులకు సూచనలు ఇస్తున్నాం

తృణధాన్యాల సాగుపై రైతులకు తరచూ సూచనలు అందిస్తున్నాం. సాగు విస్తీర్ణం పెంచేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం. ప్రస్తుతం నగరి మండలంలో సజ్జలు 35 ఎకరాల్లో సాగవుతోంది. వరి పంట సాగుతో పోల్చుకుంటే చిరుధాన్యాల సాగు కాలం తక్కువే. మార్కెట్‌లో డిమాండ్ కూడా ఉంది. దీంతో రైతుకు చిరుధాన్యాలు లాభాలు చేకూర్చే పంటలు.

**- రాఘవేంద్ర యాదవ్, వ్యవసాయ అధికారి, నగరి మండలం**

### కుశస్థలి వంతెన పరిశీలన



వంతెనను పరిశీలిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

**శ్రీరంగరాజపురం :** గంగాధరనెల్లూరు నియోజకవర్గానికి జీవనాడి అయిన కుశస్థలి నదిపై నిర్మిస్తున్న వంతెనను మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కుశస్థలి నదిని దాటే ప్రయత్నంలో ప్రజలు చాలా మంది మరణించారన్నారు.కొన్ని దశాబ్దాల నుంచి దీర్ఘకాలంగా సమస్యగా ఉందన్నారు. శ్రీరంగరాజపురం, కార్వేటినగరం, వెదురుకుప్పం మండల ప్రజలు తిరుపతి వెళ్లాలన్నా కుశస్థలి నదిని దాటి వెళ్లాల్సి ఉందన్నారు. సంబంధిత విషయం అప్పటి ముఖ్యమంత్రి జగనన్న దృష్టికి తీసుకువెళ్లి ఉడమాలకుర్తి వద్ద కుశస్థలి నదిపై వంతెనను నిర్మించడానికి రూ.27 కోట్లు మంజూరు చేశామన్నారు. నేడు వంతెన దాదాపు 99 శాతం పూర్తి కావడంతో సంతోషం వ్యక్తం చేశారు. మండలంలోని పాపిరెడ్డిపల్లి, పాతపాళ్యం, జీఎంఆర్‌పురం వంతెనలను కూడా మంజూరు చేశామన్నారు. కూటమి ప్రభుత్వం ఈ వంతెనలను నీరుగార్చిందన్నారు. గత జగనన్న ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వం అని అన్నారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా వైఎస్ఆర్ సీపీ ఉపాధ్యక్షుడు గురవారెడ్డి, సర్పంచ్ చిట్టి, నాయకులు మహేష్, కాలప్ప, గోవిందయ్య, రాజేంద్ర, డీఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలను మరో పాఠశాలకు పంపించం



ఎంఈఓ తిరుమలరాజుతో మాట్లాడుతున్న గ్రామస్తులు

**పుత్తూరు:** మండల పరిధిలోని నేసనూరు వడ్డిళ్లవాసులు తమ పిల్లలను మరో పాఠశాలకు పంపే ప్రసక్తే లేదంటూ ఎంఈఓ తిరుమలరాజు వద్ద స్పష్టం చేశారు. మంగళవారం పుత్తూరులో ఎంఈఓను కలిసిన గ్రామస్తులు మాట్లాడుతూ తమ వడ్డిళ్లలో ఒకటి నుంచి 5వ తరగతి వరకు పాఠశాల ఉండగా అందులో 30 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ఇక్కడి పాఠశాలను 2వ తరగతి వరకే పరిమితం చేసి, 3, 4, 5 తరగతులను నేసనూరు గ్రామంలోని ఎంపీపీ స్కూల్‌లో విలీనం చేయడంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేశారు. తమ పిల్లలను రెండు కిలోమీటర్ల దూరంలోని మరో పాఠశాలకు పంపమని తేల్చి చెప్పారు. దీనిపై ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు ఎంఈఓకు వినతిపత్రం అందజేశారు.

## మోసానికి బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు



నినాదాలు చేస్తున్న వైఎస్ఆర్ సీపీ నాయకులు

**వెదురుకుప్పం:** నమ్మకానికి ప్రతి రూపం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, మోసానికి బ్రాండ్ అంబాసిడర్ సీఎం చంద్రబాబు అని వైఎస్ఆర్ సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి అన్నారు. మంగళవారం వెదురుకుప్పంలో జగన్ అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్న 2019–2024లో చెప్పిన హామీలన్నీ క్యాలెండర్ రూపంలో అమలు చేసినట్లు గుర్తు చేశారు. కూటమి ఏర్పడి ఏడాది కావస్తున్నా సూపర్ సిక్స్ హామీలను అమలు చేయలేక ప్రజలను మోసం చేస్తున్నట్లు ఆరోపించారు. వైఎస్ఆర్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు బట్టే సుబ్రమణ్యం మాట్లాడుతూ మామిడి రైతుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పెడచెవిన పెడుతున్నట్లు విమర్శించారు. బూత్‌కమిటీ నియోజకవర్గ కన్వీనర్ బోడిరెడ్డి నారాయణరెడ్డి, వైఎస్ఆర్ సీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రామయ్య, కో–ఆప్షన్ సభ్యుడు వెంకటేశ్, మండల ఉపాధ్యక్షులు చిరంజీవిరెడ్డి, గోవిందన్, కార్యదర్శులు బొజ్జారెడ్డి, వెంకటేశ్, విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు జగదీశ్ రెడ్డి, బొమ్మయ్యపల్లె సర్పంచ్ గోవిందయ్య, మాజీ సర్పంచ్‌లు పెద్దిరెడ్డి, రమేష్‌రెడ్డి, నాయకులు పురంధర్‌రెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, రాము, సుబ్బయ్యబోయుడు, సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ మునికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## సోలార్ విద్యుత్ వినియోగించండి



మాట్లాడుతున్న ఈఈ ఆశీర్వాదం

**పుత్తూరు:** కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సూర్యఘర్ సోలార్ విద్యుత్ పలకల ఏర్పాటుకు ప్రజలు ముందుకు రావాలని ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ ఆశీర్వాదం కోరారు. మంగళవారం స్థానిక ఏడీకే కల్యాణ మండపంలో పుత్తూరు ఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సోలార్ విద్యుత్ వినియోగంతో చార్జీలు గణనీయంగా తగ్గుతాయని తెలిపారు. సోలార్ ఏర్పాటుకు ఒక కిలోవాట్‌కు రూ.30 వేలు సబ్సిడీ ఇస్తున్నట్లు తెలిపారు. గృహ వినియోగదారులకు మాత్రమే అందిస్తున్న ఈ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఈఈ టెక్నికల్ వాసవీలత, ఏడీఈ శంకరయ్య, ఏఈలు జైసాయి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## మామిడి రైతుల కన్నీళ్లు కనబడడం లేదా?



కృపాలక్ష్మి

**గంగాధరనెల్లూరు:** మామిడి రైతుల ఆవేదన, బాధలు రోజురోజుకు తీవ్రతరమైపోతున్నాయని, వారి కన్నీళ్లు కూటమి ప్రభుత్వం అసలు పట్టించుకోలేదని వైఎస్ఆర్ సీపీ గంగాధరనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కృపాలక్ష్మి మండిపడ్డారు. నియోజకవర్గంలో రైతులు రాష్ట్ర కష్టాలు పడుతున్నారని, సంవత్సరం కాలం పాటు కష్టం శ్రమించి అప్పుచేసి పెట్టుబడి పెట్టి మామిడి పంట చేతికి వచ్చే సమయానికి గిట్టుబాటు ధర లేక, కొనుగోలు చేసేవారు లేక అన్నదాత కన్నీరు పెడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎయిట్ ప్లస్ ఫోర్ పేరుకే చెప్పిన ఎక్కడా అమలు కాలేదని మండిపడ్డారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గ మండల కేంద్రంలో జైన్ గుజ్జు పరిశ్రమ వద్ద దాదాపు మూడు కిలోమీటర్ల మేర రైతులు మామిడి కాయలతో ట్రాక్టర్లలో నాలుగు రోజులుగా వేచి చూస్తున్నా ఫ్యాక్టరీ యాజమాన్యం ప్రభుత్వాలు కనీస స్పందన లేదు. తిండి నీరు లేక రోడ్లపై ఇబ్బందులు పడుతున్న రైతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి పూర్తి మామిడి పంటను కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

### ఘనంగా గంగమ్మ మండల పూజ



**గుడిపాల:** మండలంలోని ముత్తువాళ్లూరు గ్రామంలో మంగళవారం ఘనంగా గంగమ్మ మండల పూజ కార్యక్రమం గ్రామస్తులు నిర్వహించారు. వేదపండితుల మధ్య అమ్మవారికి పూజలతో పాటు అభిషేకం చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని వారి మొక్కులను చెల్లించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు. మధ్యాహ్నం వచ్చిన భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

# మా బడే ముద్దు.. వేరే పాఠశాల వద్దు




పాఠశాల కోసం దండం పెట్టి అభ్యర్థిస్తున్న గ్రామస్తులు



అగ్రహారం గ్రామంలో నిరసన

**గంగాధరనెల్లూరు:** తరతరాలుగా తమ తమ గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యాబుద్ధులు నేర్చుకున్నామని, నేడు తమ పిల్లలు వేరే గ్రామాలకు వెళ్లి చదువుకోవాల్సిన అవసరం ఏముందంటూ ప్రశ్నిస్తున్నారు. తమ ఊర్లోనే చదువుకోవాలి అంటూ మండలంలోని పలు గ్రామాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు నిరసన తెలిపారు. మండలంలోని అంబోదరపల్లి గ్రామపంచాయతీ ఎల్ఎన్ కండిగ గ్రామంలో దాదాపు 20 మంది విద్యార్థులు ఉండగా అక్కడనుండి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మహాదేవ మంగళం పాఠశాలకు మూడు నాలుగు ఐదు తరగతుల విద్యార్థులను ఎందుకు పంపిస్తున్నారని ప్రశ్నించారు. తమ గ్రామంలో నాడు నేడు కింద ఎంతో అభివృద్ధి పరిచిన పాఠశాలను విడిచి వేరే గ్రామానికి వెళ్లి చదువుకోవాల్సిన కర్మ ఏమిటి అన్నారు. తమ గ్రామంలోనే పాఠశాలలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్లకార్డులు ప్రదర్శించారు.

### అగ్రహారంలోనూ ఇదే తంతు

మండలంలోని పాత వెంకటాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని అగ్రహారం దళిత వాడలో దాదాపు 35 మంది విద్యార్థులతో పాఠశాల ఉదిం. అక్కడ నుండి తమిళనాడు రాష్ట్రం సరిహద్దుల్లోని కొత్త వెంకటాపురం గ్రామానికి వెళ్లి చదువుకోవాలని అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారని, దీనిపై గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రు లు మంగళవారం పాఠశాల వద్ద నిరసన తెలిపారు. అగ్రహారం గ్రామానికి చెందిన ఓ విద్యార్థి గతంలో కొత్త వెంకటాపురం పాఠశాలకు వెళ్లి తిరిగి వస్తూ ప్రమాదంలో మృతి చెందారు. అందుకే పిల్లలను అక్కడికి పంపలేమని, గ్రామంలోని పాఠశాల పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు.



మంత్రి నారా లోకేష్ పట్టించుకోవాలంటూ ప్లకార్డులతో విద్యార్థులు

#### కూలి చేసుకుంటూ చదివిస్తున్నాం..



పేద మధ్య తరగతి కుటుంబాలకు చెందిన తాము కూలి పనులు చేసుకుంటూ పిల్లలను చదివించుకుంటున్నాం. మూడు కిలోమీటర్లు మా పిల్లలు నడిచి వెళ్లి చదువుకోవాల్సిన అవసరం ఏముంది. ఏదైనా ఆరోగ్య సమస్యలు వస్తే పనులు వదులుకొని వెళ్లే పరిస్థితి ఉందా. అదే మా గ్రామంలోనే ఉంటే కుటుంబానికి చేరువగా ఉంటారు కదా. మా గ్రామంలోనే పాఠశాలను కొనసాగించాలి.

**- మాధవి, ఎల్ఎన్ కండ్రిగ గ్రామం**

#### కక్షసాధింపు చర్యలు



గత ప్రభుత్వంలో నాడు నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలకు దీటుగా అధునాతనంగా తీర్చిదిద్దారు. నేడు కూటమి ప్రభుత్వంలో విద్యార్థులపై కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నారు. గ్రామంలో 20, 30 మంది విద్యార్థుల్లో ఉన్నా సింగిల్ టీచర్‌తో చదువు చెప్పించలేని స్థితిలో ఉన్నారు. వారిని కూడా పక్క గ్రామాలకు ఎందుకు పంపిస్తున్నారు. పాఠశాల వ్యవస్థను నిర్వీర్యం చేయాలని చూస్తున్నారా. మా గ్రామంలో పాఠశాలలను కొనసాగించకపోతే ఊరుకోం. జిల్లా అధికారులు చర్యలు చేపట్టి తమ గ్రామంలోని పాఠశాలలో విద్యార్థులకు చదువు చెప్పించాలి.

**- బలరాం బాబురెడ్డి, అంబోదరపల్లి గ్రామం**

#### మా పిల్లలను పంపలేం..



ఎన్నో తరాలుగా ఎల్ఎన్ కండ్రిగ గ్రామంలోనే పాఠశాల ఉంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మహదేవ మంగళం గ్రామానికి పిల్లలను వెళ్లి చదువుకోవాలి అంటూ చేస్తున్న ప్రయత్నాలు ఆపేయాలి. మహదేవ మంగళం గ్రామానికి వెళ్లే కాలిబాటలో ముళ్ల కంపలు, పంట పొలాల బావులు ఉన్నాయి. వెళ్లే మార్గంలో విద్యార్థులకు ఏదైనా అయితే ఎలా. మా విద్యార్థులను మేం పంపలేం

**- జయలక్ష్మి, ఎల్ఎన్ కండ్రిగ గ్రామం**

#### పేద విద్యార్థులను ఆదుకోవాలి



కూటమి ప్రభుత్వం పేద విద్యార్థులపై ఎందుకు ఈ కక్ష సాధింపు, తమకు ప్రైవేటు పాఠశాలల్లో చదివించే శక్తి లేకుండానే కదా ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తున్నది. ఎన్నో ఏళ్ల క్రితం పది కిలోమీటర్ల దూరం వెళ్లి చదువుకునే రోజుల నుండి గ్రామంలోనే పాఠశాల నిర్మించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మళ్లీ 5 కిలోమీటర్ల దూరంలోనే వెళ్లి చదువుకోవాలని చేస్తున్న తీరు మంచి పద్ధతి కాదు. అగ్రహారం గ్రామంలో దాదాపు 35 మంది ఉన్న విద్యార్థులు వేరే పాఠశాలకు వెళ్లి ఎందుకు చదువుకోవాలి. ఉన్నతాధికారులు సత్వర చర్యలు చేపట్టాలి.

**- వెంకటేష్, అగ్రహారం గ్రామం**

## దొరికిపోయిన ఆవు దొంగలు



నిందితులను అదుపులోకి తీసుకొంటున్న పోలీసులు

**పుత్తూరు:** ఆవుల దొంగతనానికి వచ్చిన దొంగలను పట్టుకొన్న సంఘటన పుత్తూరు మండలం కేబీఆర్‌పురం గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకొంది. కేబీఆర్‌పురం గ్రామస్తులు జె.అమ్ములు, పి.చెంచయ్య, ఎ.శివ తదితరులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అమ్ములు భర్త శివయ్య మృతి చెందడంతో ఉన్న రెండు ఆవులను మేపుకొంటూ జీవనం సాగిస్తోంది. యథావిధిగా సోమవారం ఆవులను మేతకు తీసుకెళ్లి సాయంత్రం ఆరుబయట కట్టేసి, ఇంట్లో నిద్రించింది. అర్ధరాత్రి కుక్కలు అరుపులకు లేచిచూసిన అమ్ములుకు ముగ్గురు వ్యక్తులు తన ఆవులను మలేస్తున్నట్లు గుర్తించి, గ్రామస్తుల సాయంతో పట్టుకోవడానికి ప్రయత్నించింది. దీంతో ఓ దుండగుడు పరారయ్యారు. ఇద్దరు దొంగలు పట్టుబడ్డారు. వీరిని గ్రామస్తులు గుంజలకు కట్టేసి విచారించగా వీరిలో కేబీఆర్‌పురం గ్రామానికే చెందిన బెల్లం దాము, తిరుమలకుప్పం దళితవాడకు చెందిన లాజర్‌గా గుర్తించారు. బెల్లం దాము ఆవులను పట్టిస్తానని పిలవడంతో ఇక్కడికి వచ్చినట్లు లాజర్ తెలిపాడు, గతంలోనూ గ్రామంలో తాము 9 ఆవులు, 2 మేకలను, కోళ్లను సైతం దొంగిలించినట్లు అంగీకరించాడు. దీంతో రాత్రికి రాత్రే పోలీసులకు సమాచారం అందించి పట్టుకొన్న దొంగలను అప్పగించారు. పరారైన దొంగను సైతం పట్టుకొని న్యాయం చేయాలని గ్రామస్తులు ఫిర్యాదులో కోరారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.